సాక్షి జనగామ

శనివారం | 8 | జూన్ | 2024



చూసి.. రాసి

విద్యుత్ ఉద్యోగుల డిపార్ట్‌మెంట్ టెస్టుల్లో ఇంజనీర్ల పరీక్షకు సంబంధింత పుస్తకం ముందు పెట్టుకుని చూసి రాసే విధానం అవలంబిస్తున్నారు.

- 8లో▸



ఓవరాల్ చాంపియన్ భద్రాద్రి

హనుమకొండ జేఎన్‌ఎస్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ఓవరాల్ చాంపియన్‌గా భద్రాద్రి అథ్లెట్లు నిలిచారు.

- 8లో▸

గరిష్టం/కనిష్టం
$34^0/25^0$

వాతావరణం

ఉదయం నుంచి చల్లని వాతావరణం ఉంటుంది. ఆకాశం అధిక శాతం మేఘావృతం అవుతుంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. రాత్రి సమయంలో ఉక్కపోత కొంత ఉంటుంది.

వ్యవసాయాధికారితో నేడు ఫోన్ ఇన్



జనగామ: రుతుపవనాలు ప్రారంభం కావడంతో వ్యసాయ అధికారులు, వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్తలతో శనివారం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు 'సాక్షి' ఫోన్‌ఇన్ ప్రోగ్రాం నిర్వహిస్తోంది. జిల్లాలోని రైతులు **పంటల సాగు కోసం తమ సందేహాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి** ఈ కింది నంబర్లలో సంప్రదించాలని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి వినోద్‌కుమార్ తెలిపారు.

తేది : 8-6-2024, నేడు(శనివారం)
ఫోన్ చేయాల్సిన నంబరు :
9705346396
సమయం : ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు

న్యూస్‌రీల్

నేటి లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలి

జిల్లా జడ్జి డి.రవీంద్రశర్మ

జనగామ రూరల్: స్థానిక కోర్టులో జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం(నేడు) నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా జడ్జి డి.రవీంద్ర శర్మ, సీనియర్ సివిల్ జడ్జి సి.విక్రమ్ ఒక ప్రకటనలతో తెలిపారు. ఉద యం 10 నుంచి 5 గంటల వరకు లోక్ అదాలత్ ఉంటుందని, కక్షిదారులు పంతాలు, పట్టింపులకు పోకుండా సామరస్యంగా సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు. కేసుల కారణంగా సమయం, డబ్బు వృథా అవుతుందని చెప్పారు. వివాహ, కుటుంబ తగాదాలు, యాక్సిడెంట్, చిట్‌ఫండ్, క్రిమినల్, సివిల్ వంటి కేసులు ఈ వేదిక ద్వారా పరిష్కరించుకోవచ్చని సూచించారు.


పాఠశాలలను తెరిపించాలి



జనగామ రూరల్ : విద్యార్థులు లేరనే సాకుతో జిల్లాలో మూసివేసిన పాఠశాలలను తెరిపించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీలు వెంటనే చేపట్టాలన్నారు. విద్యాహక్కు చట్టం-2009 ప్రకారం 6-14 ఏళ్ల లోపు బాల బాలికలకు ఉచిత నిర్బంధ విద్య అందించాలని చెబుతున్న పాలకులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఉపాధ్యాయులు బి.లక్ష్మయ్య, ఎస్ఎన్.రాజు, వై.వజ్రయ్య, శ్రీహరి, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మృగశిర కార్తె..

జోరుగా చేపల అమ్మకాలు



జనగామ: రోహిణి ముగిసి శనివారం నుంచి మృగశిర కార్తె ఆరంభం కానుంది. ఈ కార్తె తొలిరోజు చేపలు తినేందుకు ప్రజలు ప్రాధాన్యత ఇస్తారు. దీంతో జిల్లా కేంద్రంతో పాటు ఆయా మండలాల పరిధి చేపల మార్కెట్లలో శుక్రవారం వ్యాపారం జోరుగా సాగింది. మృగశిర కార్తె 15 రోజుల పాటు ఉంటుంది. ఈ కార్తె రోజు చేపలు తినడం వల్ల వ్యాధులు దూరమవడమే కాకుండా.. గుండె జబ్బులు, అస్తమా వ్యాధుల నుంచి ఉపశమనం కలుగుతుందని ప్రజల నమ్మకం. ఈ క్రమంలో జనం ఎక్కువగా ఇష్టపడే కొర్రమీను, రోహు, కట్ల, రవ్వ, బొమ్మె చేపలకు డిమాండ్ పెరిగింది.

11న జాబ్ మేళా

జనగామ రూరల్: జిల్లా కేంద్రం సిద్దిపేట రోడ్డులోని ఏకశిల ఐటీఐ కళాశాలలో ఈనెల 11న నిర్వహించే జాబ్ మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉపాధి అధికారి ఉమారాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్‌బ్యాంక్‌లో సీనియర్ ఆఫీసర్ పోస్టులు 50 ఖాళీగా ఉన్నాయని తెలిపారు. డిగ్రీ అర్హతతో 27 నుంచి 30 ఏళ్ల వయస్సు ఉండాలని, సంబంధిత సర్టిఫికెట్లు, ఫొటోలతో హాజరుకావాలని సూచించారు. జాబ్ మేళా ఉదయం 10.30 నుంచి ప్రారంభం అవుతుందని, మరిన్ని వివరాలకు 79954 30401 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

సాగు షురూ..

పలకరించిన తొలకరి

- అన్నదాతల పొలం బాట
- జోరందుకున్న వానాకాలం వ్యవసాయ పనులు
- కిటకిట లాడుతున్న ఎరువుల దుకాణాలు
- జిల్లాలో 3.70 లక్షల ఎకరాల సాగు అంచనా..

చిల్పూరు : మల్కాపూర్‌లో నారు మండె కడుతున్న రైతులు





కొడకండ్ల : దుక్కి దున్నుతున్న రైతు



విత్తనాలు కొనుగోలు చేసి తీసుకెళ్తున్న రైతు



జనగామ : విత్తనాలు కొనుగోలు చేస్తున్న రైతులు

జనగామ: జిల్లాలో తొలకరి పలకరింపుతో వానాకాలం సీజన్ వ్యవసాయ పనులు జోరందుకున్నాయి. ఈనెల 6వ తేదీ రాత్రి నుంచి తెల్లవారు జాము వరకు కురిసిన వర్షంతో రైతులు పొలం బాట పట్టారు. నైరుతి రుతుపవనాలు చురుకుగా కదులుతుండడంతో.. రాగల మూడు రోజుల్లో తేలిక పాటి నుంచి మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ ప్రకటించడంతో రైతులు పనులను మరింత ముమ్మరం చేశారు. పొలం వద్ద గ్రామ దేవతలకు పూజలు చేస్తూ.. నార్లకు మండెలు కడుతూ, దుక్కులు దున్ని నాట్లు వేసుకునేందుకు పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు. గురువారం అమావాస్యను పురస్కరించుకుని పూజలు చేసి సాగు పనులు మొదలు పెట్టగా.. జిల్లా పరిధి పలు ప్రాంతాల్లో ముందస్తు వరి నాట్లు మొదలయ్యాయి. పత్తి విత్తనాలు నాటే పనులు జోరందుకున్నాయి. చాలాచోట్ల ఇప్పుడిప్పుడే దుక్కులు దునున్నారు. పత్తి సాళ్లను ముందుగానే సిద్ధం చేసుకున్న రైతులు.. వరి నాట్ల కోసం విత్తనాలను మండె కడుతున్నారు. బురద పొలంలో సాంద్రతను పెంచుకునేందుకు పశువుల ఎరువును తరలిస్తున్నారు.

విత్తనాల కొనుగోలు

జిల్లాలో ఈ సీజన్‌లో వరి, పత్తి, కందులు, ఇతర పంటలు కలిపి 3.70లక్షల ఎకరాల్లో సాగు చేసే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఇందుకు సంబంధించి 74.251 మెట్రిక్ టన్నుల యూరియా, డీఏపీ, కాంప్లెక్స్, పొటాష్, 63వేల క్వింటాళ్ల వరి విత్తనాలు, 4.35లక్షల పత్తి విత్తన ప్యాకెట్లు, 400 క్వింటాళ్ల కంది విత్తనాలు తదితర రకాల వాటిని అందుబాటులో ఉంచారు. అయితే నైరుతి రుతుపవానలు చురుకుగా కదులుతూ తొలకరి వర్షాలు మొదలు కావడంతో విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయడానికి రైతులు దుకాణాలకు పరుగుపెడుతున్నారు. జిల్లా కేంద్రంతో పాటు మండల కేంద్రాల్లోని విత్తన షాపులు కిటకిటలాడుతున్నాయి.

6, 7 తేదీల్లో నమోదైన వర్షపాతం వివరాలు

జిల్లాలో ఈనెల 5వ తేదీ ఉదయం 8.30 నుంచి 6వ తేదీ ఉదయం 5 గంటల వరకు 5.5 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. 6వ తేదీ ఉదయం 8.30 నుంచి రాత్రి 8 గంటల వరకు 18.8 మి.మీ, రాత్రి 9 వరకు 21.5 మి.మీ, 6వ తేదీ ఉదయం 8.30 నుంచి 7వ తేదీ ఉదయం 6 గంటల వరకు 27.7 మి.మీ, ఉదయం 8 గంటల వరకు 28.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు.

అందుబాటులో అన్ని రకాల విత్తనాలు : డీఏఓ వినోద్‌కుమార్

వానాకాలం సీజన్ నేపథ్యంలో అన్ని రకాల పంటల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని డీఏఓ వినోద్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ జిల్లాలో 3.25 లక్షల పత్తి విత్తన ప్యాకెట్లు అవసరం అవుతాయని అంచనా వేయగా, వివిధ కంపెనీలకు చెందిన 3 లక్షల ప్యాకెట్ల స్టాక్ ఉందన్నారు. ఇప్పటి వరకు 1.25 లక్షల ప్యాకెట్లను రైతులు కొనుగోలు చేసినట్లు తెలిపారు. కాగా వరి, కందులు, మొక్కజొన్న ఇతర అన్ని రకాల పంటల విత్తనాలు, ఎరువులు, యూరియా, కాంప్లెక్స్, డీఏపీ సీజన్‌కు సరిపడా ఉన్నాయని చెప్పారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

జిల్లాలో గురువారం నుంచి శుక్రవారం ఉదయం వరకు మండలాల వారీగా నమోదైన వర్షపాతం వివరాలు(మిల్లీ మీటర్లలో)..

మండలం	పాలకుర్తి	దేవరుప్పల	చిల్పూరు	జఫర్‌గఢ్	నర్మెట	తరిగొప్పుల	రఘునాథపల్లి	లింగాలఘణపురం	బచ్చన్నపేట	స్టేషన్‌ఘన్‌పూర్	కొడకండ్ల
వర్షపాతం	62.3	53.0	46.3	43.5	37.8	31.3	30.8	28.3	24.8	19.5	14.0

ముగిసిన 'పట్టభద్రుల' లెక్కింపు

మూడు రోజులు ఉత్కంఠగా సాగిన ప్రక్రియ

- మొదటి ప్రాధాన్యత, రెండో ప్రాధాన్యతలోనూ మల్లన్నకే మెజారిటీ
- రెండో ప్రాధాన్యత ఓట్లతో విజయం



కౌంటింగ్ కేంద్రం వద్ద విజయసంకేతం చూపిస్తున్న మల్లన్న, అభిమానులు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక కౌంటింగ్ మూడు రోజులు నిర్విరామంగా కొనసాగింది. పగలు, రాత్రి ఆగకుండా అధికారులు సిబ్బంది మూడు విడతలుగా కౌంటింగ్ ప్రక్రియను కొనసాగించారు. ఈ నెల 5వ తేదీన ఉదయం 8 గంటలకు ప్రారంభమైన కౌంటింగ్ ప్రక్రియ 7వ తేదీ అర్ధరాత్రి వరకు కొనసాగింది. 5వ తేదీ ఉదయం నుంచి సాయంత్రం 4 గంటల వరకు బ్యాలెట్ బాక్సుల్లోని పేపర్లను తీసి 25 ఓట్లను కట్టలుగా కట్టే ప్రక్రియను పూర్తిచేశారు. అదే రోజు సాయంత్రం 5 గంటల నుంచి మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపును ప్రారంభించారు. బుధవారం రాత్రంతా కొనసాగింది. గురువారం రాత్రి వరకు మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపును పూర్తి చేశారు. ఈ మొదటి ప్రాధాన్యతలో పోటీ చేసిన 52 మంది అభ్యర్థుల్లో ఏ ఒక్కరికి గెలుపునకు నిర్ణయించిన టార్గెట్ కోటా ఓట్లు 1,55,095 రాకపోవడంతో ఎలిమినేషన్ రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపును గురువారం సాయంత్రం నుంచి శుక్రవారం రాత్రి వరకు చేపట్టారు.

రెండో ప్రాధాన్యత ఓట్లలోనూ అధిక్యతే..

రెండో ప్రాధాన్యత ఓట్లలోనూ మల్లన్న ఆధిక్యం సాధించారు. 52 మంది అభ్యర్థులు పోటీలో ఉండగా మొదటి ప్రాధాన్యత ఓట్లలో మల్లన్న ఆధిక్యంలో ఉన్నా.. గెలుపునకు అవసరమైన 1,55,096 ఓట్లు రాలేదు. మొదటి ప్రాధాన్యతలో 1,22,813 ఓట్లు మాత్రమే వచ్చాయి. దీంతో గెలుపునకు ఇంకా 32,282 ఓట్లు రావాల్సి ఉంది. బీఆర్‌ఎస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు 1,04,248 ఓట్లు వచ్చాయి. ఆయన గెలుపు లక్ష్యం చేరుకోవాలంటే 50,840 ఓట్లు అవసరం ఉంది. తక్కువ ఓట్లు వచ్చిన అభ్యర్థులను ఒక్కొక్కరిని ఎలిమినేట్ చేస్తూ రెండో ప్రాధాన్యత, సబ్ పార్సిల్ ఓట్లను కూడా లెక్కిస్తూ వచ్చారు. ఇలా తక్కువ ఓట్లు వచ్చిన 48 మంది అభ్యర్థులను ఎలిమినేట్ చేసి వారికి వచ్చిన రెండో ప్రాధాన్యత ఓట్లతో పాటు సబ్ పార్సిల్(ఇతర ప్రాధాన్యతలు) ఓట్లు లెక్కించారు. దీంతో మిగిలిన నలుగురు అభ్యర్థుల్లో కాంగ్రెస్ అభ్యర్థి మల్లన్న 1,24,899 ఓట్లకు చేరుకోగా, బీఆర్‌ఎస్ అభ్యర్థికి 1,05,524 ఓట్లు వచ్చాయి. కాగా, బీజేపీ అభ్యర్థి 43,096 ఓట్లకు చేరుకున్నారు. అయినప్పటికీ గెలుపు టార్గెట్‌కు ఎవరూ చేరుకోకపోవడంతో 4వ స్థానంలో ఉన్న స్వతంత్ర అభ్యర్థి అశోక్‌ను ఎలిమినేట్ చేసి ఆయనకు వచ్చిన రెండో ప్రాధాన్యత, సబ్ పార్సిల్ ఓట్లను లెక్కించారు. అప్పటికీ టార్గెట్ రాకపోవడంతో బీజేపీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డిని ఎలిమినేట్ చేసి ఆయన ఓట్లను లెక్కించారు. అయినా కూడా కాంగ్రెస్ అభ్యర్థి మల్లన్నకు బీఆర్‌ఎస్ అభ్యర్థి కంటే అధిక మెజారిటీ ఉన్నా గెలుపు టార్గెట్‌కు సరిపడా ఓట్లు రాలేదు. అయితే మల్లన్న గెలిచినట్లే అయినప్పటికీ టెక్నికల్‌గా మాత్రం టార్గెట్ చేరుకునేందుకు తక్కువ ఓట్లు వచ్చిన బీఆర్‌ఎస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డిని ఎలిమినేట్ చేసి ఆయనకు వచ్చిన రెండో ప్రాధాన్యత ఓట్లు లెక్కిస్తున్నారు. టెక్నికల్‌గా రాకేష్‌రెడ్డి ఓట్లను టార్గెట్ వచ్చేంత వరకు లెక్కించాల్సి ఉన్నందున ఆ ప్రక్రియ కొనసాగుతోంది. ఆ తర్వాత ఎన్నికల అధికారులు మల్లన్నకు గెలుపు ధ్రువీకరణ పత్రాన్ని అందజేయనున్నారు.

అన్ని రౌండ్లలో ఆధిక్యత..

మొదటి ప్రాధాన్యత ఓట్లలో మొదటి రౌండ్‌లో తీన్మార్ మల్లన్నకు 36,210 ఓట్లు వచ్చాయి. బీఆర్‌ఎస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డికి 28,540 ఓట్లు వచ్చాయి. ఇందులో మల్లన్న బీఆర్‌ఎస్ అభ్యర్థి కంటే 7,670 ఓట్ల మెజార్టీ సాధించారు. రెండో రౌండ్‌లో కాంగ్రెస్ అభ్యర్థి మల్లన్నకు 34,574 ఓట్లు రాగా బీఆర్‌ఎస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డికి 27,574 ఓట్లు వచ్చాయి. ఈ రెండో రౌండ్‌లో కూడా 7వేల ఓట్ల ఆధిక్యంలో మల్లన్న ఉన్నారు. 3,4 రౌండ్లలో కలిపి మల్లన్న 52,029 ఓట్లు సాధించగా బీఆర్‌ఎస్ అభ్యర్థికి 48,134 ఓట్లు మాత్రమే వచ్చాయి. ఈ రౌండ్లలో బీఆర్‌ఎస్ అభ్యర్థి కంటే 3895 ఓట్ల అధిక్యత సాధించారు. దీంతో మొదటి ప్రాధాన్యత ఓట్లలో మొత్తం 18,565 ఓట్ల ఆధిక్యంలో కాంగ్రెస్ అభ్యర్థి నిలిచారు.

గ్రూప్-1 పరీక్షకు పటిష్ట ఏర్పాట్లు

- అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

జనగామ రూరల్: జిల్లాలో ఈనెల 9న నిర్వహించే గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని.. అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో పరీక్ష నిర్వహణపై చేపట్టిన శిక్షణలో ఆయన మాట్లాడారు. ఆదివారం నిర్వహించే గ్రూప్-1 పరీక్షకు 3,697 మంది అభ్యర్థులు హాజరుకానున్నారని, ఇందుకు 14 సెంటర్లు కేటాయించినట్లు చెప్పారు. పరీక్ష కేంద్రాల్లో తాగునీరు, టాయిలెట్లు, ఇతర సౌకర్యాలు కల్పించి ఎలాంటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికే పరీక్షల నిర్వహణకు సంబంధిత అధికారులను కేటాయించామని, ఎగ్జామ్ సెంటర్‌లోకి ఫోన్‌లు, ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకురాకూడదని చెప్పారు. తనిఖీలు చేపట్టిన తర్వాతే లోనికి అనుమతివ్వాలని సూచించారు. అభ్యర్థులు హాల్‌టికెట్ డౌన్‌లోడ్ సందర్భంగా సమస్యలు తలెత్తితే 9866011608 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. హాల్ టికెట్‌పై ఫొటో సరిగా లేకుంటే గెజిటెడ్ సంతకంతో కూడిన అండర్ టేకింగ్ ఫామ్, ప్రభుత్వ ఫార్మాట్‌తో పరీక్ష కేంద్రానికి తీసుకురావాలని పేర్కొన్నారు. అభ్యర్థి బయోమెట్రిక్ ఇవ్వకుంటే పరీక్షకు అనుమతించరని స్పష్టం చేశారు. అంతకు ముందు అధికారులకు పరీక్ష నిర్వహణపై మాస్టర్ ట్రైనర్ రామరాజు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, డీఆర్డీఏ మొగిలప్ప, జెడ్పీసీఈఓ అనిల్‌కుమార్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూంకు చేరిన ప్రశ్నపత్రాలు

ఆదివారం నిర్వహించే గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష పత్రాలు పోలీసు బందోబస్తు మధ్య అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్, పరీక్షల కన్వీనర్ ఎ.నర్సయ్య పర్యవేక్షణలో శుక్రవారం కలెక్టరేట్‌లోని స్ట్రాంగ్ రూంకు చేరుకున్నారు. కలెక్టరేట్ ఏఓ రవీందర్, డీఈఓ రాము, ఏసీపీ ఇతర అధికారులు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

- జిల్లా విద్యాధికారి రాము



నోట్‌బుక్స్ అందజేస్తున్న డీఈఓ రాము

జనగామ రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని, తల్లిదండ్రులు తమ పిల్లలను సర్కారు స్కూళ్లలో చేర్పించాలని డీఈఓ కె.రాము అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్ పంపిణీ కేంద్రాన్ని ఆయన శుక్రవారం పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. జిల్లాకు 2,29,630 పాఠ్యపుస్తకాలు అవసరం ఉండగా 2,03,300, నోట్ పుస్తకాలు 2,02653 అవసరం ఉండగా పూర్తిగా వచ్చాయని, వాటిని మండలాలకు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. పాఠశాలల పునః ప్రారంభం కాగానే విద్యార్థులకు అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో డీసీఈబీ చంద్రబాను, ఏసీజీఈ రవికుమార్, నోడల్ అధికారి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.


యాదాద్రిలో పేరిణి నృత్యం చేస్తున్న బచ్చన్నపేట విద్యార్థినులు



యాదాద్రిలో పేరిణి ప్రదర్శన

బచ్చన్నపేట : మండల కేంద్రానికి చెందిన విద్యార్థినులు శుక్రవారం యాదాద్రి శ్రీ లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానంలో 'నిత్య నాట్య సంగీత' కార్యక్రమంలో భాగంగా పేరిణి నృత్యం ప్రదర్శించి ఆహూతులను ఆకట్టుకున్నారు. శ్రీ చంద్రకళా నిలయంలో గురు శ్రీ పేరిణి సంతోష్, బచ్చన్నపేటకు చెందిన శిష్య బృందం పాల్గొంది.

అణువణువూ పరిశీలిస్తూ..





అన్నారం బ్యారేజీ వద్దకు నడుచుకుంటూ వస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తదితరులు, మేడిగడ్డ బ్యారేజీ పరిస్థితిని మంత్రికి వివరిస్తున్న ఇంజనీరింగ్ అధికారులు

కాళేశ్వరం అన్నారం, మేడిగడ్డలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

- క్షుణ్ణంగా బ్యారేజీల మరమ్మతు పనుల పరిశీలన
- క్షేత్రస్థాయిలో ఇరిగేషన్, నిర్మాణ సంస్థల పనితీరుపై ఆరా
- ఇంజనీర్లపై మంత్రి సీరియస్
- వరదలు రాకముందే మరమ్మతులు పూర్తి చేయాలని ఆదేశం



మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వేదికపై ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు, అధికారులు

సాక్షిప్రతినిధి, వరంగల్/కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో నిర్మించిన అన్నారం, మేడిగడ్డ బ్యారేజీల్లో చేస్తున్న మరమ్మతులను రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి నల్లమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి శుక్రవారం ఈఎన్‌సీ జనరల్ అనిల్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. బ్యారేజీలను అణువణువూ పరిశీలిస్తూ.. పనులపై ఇంజనీర్లను ప్రశ్నిస్తూ మంత్రి పర్యటన సాగింది. మంత్రి ఉత్తమ్ హైదరాబాద్ నుంచి నేరుగా హెలికాప్టర్‌లో పెద్దపల్లి జిల్లాలోని సుందిళ్ల బ్యారేజీకి చేరుకొని అక్కడ చేస్తున్న మరమ్మతులను పరిశీలించారు. తర్వాత భూపాలపల్లి జిల్లా అన్నారం బ్యారేజీకి మధ్యాహ్నం 1.38గంటలకు చేరుకున్నారు. హెలిపాడ్‌నుంచి వాహనాల్లో బ్యారేజీలోకి వెళ్లారు. 34వ పియర్ డౌన్ స్ట్రీమ్ వెంట చివరన గ్రౌటింగ్ పనులను పరిశీలించి, పురోగతిని ఇంజనీర్లను అడిగి తెలుసుకున్నారు. గ్రౌటింగ్ పనులు, సీసీ బ్లాకుల అమరిక, ఇసుక మేటల తొలగింపును ఈఈ యాదగిరి మంత్రికి వివరించారు. గేట్లపైన క్రస్ట్‌పై ఇంజనీర్లతో కొంతసేపు సమీక్షించారు. 2.12 గంటలకు అన్నారం నుంచి అంబట్‌పల్లి లోని మేడిగడ్డ బ్యారేజీకి హెలికాప్టర్‌లో వెళ్లారు. 2.45గంటలకు మేడిగడ్డ(లక్ష్మీ) బ్యారేజీ ఎల్‌అండ్‌టీ క్యాంపు కార్యాలయంలో భోజనం చేసి ఇరిగేషన్ ఉన్నతాధికారులు, ఎల్‌అండ్‌టీ, నవయుగ, అఫ్కాన్స్ నిర్మాణ సంస్థ ప్రతినిధులతో సమావేశమయ్యారు. అనంతరం 3గంటలకు మంత్రి మీడియా సమావేశం నిర్వహించారు. కాళేశ్వరం బ్యారేజీల్లో చేపట్టిన మరమ్మతు పనులు వరదలు రాక ముందే పూర్తి చేయాలని ఆదేశించారు. ఎన్నికల కోడ్‌తో ఇన్నాళ్లు సమీక్ష, పరిశీలనలు వాయిదా పడ్డాయన్నారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలలో వాస్తవ పరిస్థితులను తెలుసుకోవడానికి వచ్చినట్లు తెలిపారు. ఈఎన్‌సీ అనిల్‌కుమార్ మాట్లాడుతూ బ్యారేజీల్లో జీఆర్‌పీ, ఈఆర్‌టీ, సీకెంట్‌ఫైల్స్ పరీక్షలు చేస్తున్నామన్నారు. గేట్లన్నీ తెరిచి ఉంచుతామని, ప్రాణహిత ద్వారా కన్నెపల్లి పంపుహౌస్ వద్ద 3 మీటర్ల ఎత్తులో నీరు ఉందని చెప్పారు. నీటినిల్వకు త్వరలో జియోట్యూబ్ ఏర్పాటు చేసి పంపుహౌస్ ద్వారా ఎత్తిపోయడానికి సన్నాహాలు చేస్తున్నామన్నారు. అన్నారం బ్యారేజీ వద్ద 11మీటర్లు, సుందిళ్ల బ్యారేజీల్లో 9 మీటర్లతో నీటిని ఎల్లంపల్లికి తరలించవచ్చన్నారు. ఎల్‌అండ్‌టీ ప్రతినిధి సురేష్ మాట్లాడుతూ మరమ్మతు పనులు తుది దశకు వచ్చాయని, ఇసుక బస్తాలు వేస్తున్నామన్నారు. షీట్‌ఫైల్స్ పనులు 40 శాతం, సీసీ బ్లాక్స్, గేట్ల కటింగ్ పనులు జరుగుతున్నట్లు తెలిపారు. బోర్‌వెల్‌తో పరీక్షలు చేస్తున్నామన్నారు.

పోలీసుల బందోబస్తు..

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పర్యటన సందర్భంగా 200మంది పోలీసులతో అన్నారం, మేడిగడ్డ బ్యారేజీల వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు. మంత్రి వెంట కలెక్టర్ భవేష్‌మిశ్రా, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు గండ్ర సత్యనారాయణ, మక్కాన్‌సింగ్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, కాంగ్రెస్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు ప్రకాశ్‌రెడ్డి, ఎంపీపీ రాణిబాయి, ఎస్పీ కిరణ్‌ఖరే, ఓఅండ్‌ఎం సీఈ నాగేందర్‌రావు, క్వాలిటీ కంట్రోల్ సీఈ వెంకట్‌రెడ్డి, ఈఈ తిరుపతిరావు, డీఈఈ సూర్యప్రకాశ్ తదితరులు ఉన్నారు.

మేడిగడ్డ బ్యారేజీ పరిశీలన..

మేడిగడ్డ బ్యారేజీలో 7వ బ్లాక్‌లో కుంగిన 17, 20వ పియర్లను మంత్రి ఉత్తమ్ పరిశీలించారు. 20వ పియర్ వద్ద గేట్ల కటింగ్, గేట్ల తొలగింపు పనులను చూశారు. బ్యారేజ్ డౌన్ స్ట్రీమ్‌లో షీట్ ఫైల్స్, సీసీ బ్లాక్ అమరిక, గ్రౌటింగ్ ద్వారా సిమెంట్, ఇసుక మిశ్రమాలతో కలిపి బొరియలను పూడ్చివేస్తున్నారు. ఈ పనుల పురోగతిపై రామగుండం సీఈ సుధాకర్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఆయన జూన్ చివరి వరకు వరదలను తట్టుకునేలా కాఫర్ డ్యాం తయారీగా ఉంటుందని తెలిపారు. వర్షాలు వచ్చి వరదలు పెరిగితే గేట్లు ఎత్తి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఎన్‌డీఎస్‌ఏ సూచించిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని నిర్మాణ సంస్థ ప్రతినిధులు, ఇంజనీరింగ్ అధికారులను మంత్రి ఆదేశించారు. సాయంత్రం 4.30గంటలకు హెలికాప్టర్‌లో హైదరాబాద్‌కు తరలివెళ్లారు.

డీసీసీబీలో డిపాజిట్లకు అధిక వడ్డీ



కరపత్రాలు విడుదల చేస్తున్న అధికారులు

జనగామ రూరల్: డీసీసీ బ్యాంక్‌లో రైతులు డిపాజిట్ చేసి అధిక వడ్డీ పొందాలని బ్యాంకు నోడల్ ఆఫీసర్ కోటేశ్వర్ అన్నారు. శుక్రవారం పీఏసీఎస్ కార్యాలయం వద్ద డిపాజిట్ కరపత్రాలు ఆవిష్కరించి మాట్లాడారు. తెలంగాణ దశాబ్ది డిపాజిట్ కింద అత్యధిక వడ్డీ 8.10 శాతం ఇస్తున్నామని, రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ నిమ్మతి మహేందర్‌రెడ్డి, బ్రాంచ్ మేనేజర్ సంతోషిమాత, సూపర్‌వైజర్ ప్రసాద్, సీఈఓ రామ్మోహన్ పాల్గొన్నారు.

'గ్రూప్-1 ప్రిలిమ్స్‌కు విద్యుత్ అంతరాయం ఉండొద్దు'

హన్మకొండ: గ్రూప్-1 ప్రిలిమ్స్‌కు విద్యుత్ అంతరాయాలు లేకుండా చర్యలు తీసుకోవాలని టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి సర్కిళ్ల సూపరింటెండెంట్ ఇంజనీర్లను ఆదేశించారు. శుక్రవారం హనుమకొండ నక్కలగుట్టలోని టీజీ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం నుంచి సంస్థ పరిధిలోని 18 సర్కిళ్ల ఎస్ఈలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. టీజీ పీఎస్సీ.. ఈ నెల 9న రాష్ట్ర వ్యాప్తంగా గ్రూప్-1 ప్రిలిమ్స్ నిర్వహిస్తోందన్నారు. ఈ నేపథ్యంలో పరీక్ష కేంద్రాలకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా జరిగేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద ఏఈ స్థాయి అధికారిని నోడల్ ఆఫీసర్‌గా నియమించాలన్నారు. పరీక్ష సజావుగా జరిగేలా చూడాలన్నారు. కాన్ఫరెన్స్‌లో ఇన్‌చార్జ్ డైరెక్టర్లు టి.సదర్ లాల్, వి.మోహన్ రావు, సీజీఎం కె.కిషన్, డి.ఈ(టి) కె.అనిల్ కుమార్ పాల్గొన్నారు.

ఈతకెళ్లి యువకుడి మృతి


అఖిల్ (ఫైల్)

రాయపర్తి(వర్ధన్నపేట): స్నేహితులతో సరదాగా ఈతకు వెళ్లిన ఓ యువకుడు బావిలో మునిగి మృతి చెందాడు. ఈ ఘటన శుక్రవారం వర్ధన్నపేట మండలం కట్ర్యాలలో చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కొండ్రాతి కిషన్, మాధవి దంపతుల కుమారుడు అఖిల్(25) తన బావ, స్నేహితులతో కలిసి గ్రామంలోని ఎస్సారెస్పీ కాల్వ పక్కన ఉన్న చెంగల సమ్మయ్య బావిలో ఈతకు వెళ్లాడు. ఈ క్రమంలో బావిలో దూకి ఈత కొట్టి బయటకు వచ్చాడు. అనంతరం మరోసారి బావిలోకి దూకి ఎంతకూ పైకి రాకపోవడంతో స్నేహితులు.. గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని గ్రామస్తుల సహకారంతో గాలింపు చర్యలు చేపట్టి అఖిల్ మృతదేహాన్ని బయటకు తీశారు. కాగా, అఖిల్ తల్లిదండ్రులు హైదరాబాద్‌లో జీవనం కొనసాగిస్తున్నారు. ఇంటర్ పూర్తి చేసుకున్న అఖిల్ శుక్రవారం తన చెల్లెలు అంజలి, బావతో కలిసి కట్ర్యాలకు వచ్చి అనంతలోకాలకు చేరాడు. దీంతో ఆ కుటుంబంలో తీరని విషాదం నెలకొంది.

బతుకుదెరువుకు వెళ్లి బిడ్డను పోగొట్టుకున్నారు..

- హైదరాబాద్ మియాపూర్‌లో బాలిక అదృశ్యం


వసంత (ఫైల్)

మరిపెడ రూరల్: ఆ దంపతులు బతుకుదెరువు కోసం పొట్టచేతపట్టుకుని హైదరాబాద్ వెళ్లారు. అయితే దురదృష్టశాత్తు వారి బిడ్డ అక్కడ తప్పిపోయింది. వివరాలు ఇలా ఉన్నాయి. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం లక్ష్మాతండాకు చెందిన బానోత్ నరేశ్, శారద దంపతులు బతుకుదెరువు నిమిత్తం 10 రోజుల క్రితం తమ ఇద్దరు పిల్లలను తీసుకుని హైదరాబాద్ వెళ్లారు. అక్కడ మియాపూర్ పరిధిలోని ఏటిగడ్డ తండాలో ఉంటూ కూలీ పనులు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం తమ కూతురు వసంత బిస్కెట్ ప్యాకెట్ తెచ్చుకుంటానని సమీపంలోని కిరాణ షాపునకు వెళ్లింది. ఎంతకూ ఇంటికి రాకపోవడంతో నరేశ్ వెళ్లాడు. అక్కడ షాపు వద్దకు వెళ్లి చూడగా బిడ్డ కనిపించక పోవడంతో గుండెలవిసేలా రోదించాడు. అనంతరం మియాపూర్ ప్రాంత మొత్తం వెతికినా ఫలితం కనిపించలేదు. దీంతో మియాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు నరేశ్ తెలిపాడు. కాగా, తప్పిపోయిన బాలిక వసంత మరిపెడ మండలంలోని ఎల్లంపేట హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతోంది.



సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

■ హౌస్, ప్లాట్, వ్యవసాయ భూములు మార్టిగేజ్ చేసుకొని అమౌంట్ ఇప్పించబడును. Cibil అవసరం లేదు. Cont: 7842279342 హన్మకొండ. [WA-7526]

BUSINESS OFFER

■ ICF Corporation Provide. Agri, Busi,Personal, Edu, Property Loans Agents & DMA Req Good Salary & Commission. Call : 7015882322 [H-189662]

WANTED

■ Urgent Requirement, Collection Executives and Team Leaders, Tele Callers Banking and NBFC Loans Recovery, Good Salary + Incentives, DRA and Non DRA Freshers also apply. Dist: Warangal, Hanamkonda, Bhupalpally, Parkal and Narsampet, Mahabubabad. Cont: 7382610097, 9490336638 [W-1242413]

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500/- మీ పేరు, అడ్రస్ కాల్/ వాట్సప్ చేయగలరు. 95026 15217. [M-1185206]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీతం: 18K. Ph: 9160900024, 9640400073 [H-799887]

WANTED TEACHERS

■ Wanted Experience (M&F) Local & Kerala Teachers for Primary Hindi, English, Higher Section Hindi, Good Salary for fluent English, Elohim School, Kommala, WGL, Cell No: 9390112329, 7702026999. [W-1242479]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన రూ॥ 260/-
అదనపు లైను రూ॥ 60/- మాత్రమే
5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
హన్మకొండ : 9010144453
వరంగల్ : 9705748198
నర్సంపేట : 9553955722
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వారా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

చూసి.. రాసి

విద్యుత్ డిపార్ట్‌మెంట్ టెస్టుల్లో ఇంజనీరింగ్ అధికారులు చూచిరాత

- ప్రావెన్షియల్ ఉద్యోగులకు మాత్రం మొండి చేయి
- ద్వంద్వ విధానాలు పాటిస్తున్న టీజీ ట్రాన్స్‌కో..
- అందుబాటులో లేని డిపార్ట్‌మెంట్ పరీక్ష పుస్తకాలు
- ఎలా ప్రిపేర్ కావాలంటున్న ప్రావెన్షియల్ ఉద్యోగులు
- నేడు, రేపు పరీక్ష





హన్మకొండ : విద్యుత్ ఉద్యోగుల డిపార్ట్‌మెంట్ టెస్టుల్లో టీజీ ట్రాన్స్‌కో ద్వంద్వ విధానాలు అవలంబిస్తుంది. ఇంజనీరింగ్ అధికారులకు, ప్రావెన్షియల్ ఉద్యోగులకు వేర్వేరు విధానాలు పాటిస్తోంది. విద్యుత్ సంస్థల్లో ఇంజనీర్లు యాజమాన్యంగా ఉంటూ వస్తున్నారు. దీంతో తమకు అనుకూలించే విధంగా డిపార్ట్‌మెంట్ పరీక్షలు రూపకల్పన చేశారనే ఆరోపణలు కోకొల్లలు. ప్రావెన్షియల్ ఉద్యోగులైన జూనియర్, సీనియర్ అసిస్టెంట్లకు బట్టీ పట్టి పరీక్ష రాసే విధానం ఉంది. ఇది కూడా వ్యాసరూప పద్ధతిలో రాయాలి. అదే ఇంజనీర్లకు సంబంధిత పరీక్షకు సంబంధిత పుస్తక ముందు పెట్టుకుని చూసి రాసే విధానం అవలంబిస్తోంది. ఫలితంగా ఒకే సంస్థలో పని చేస్తున్న ఉద్యోగుల మధ్య వివక్ష చూపిస్తున్నారని పలువురు ప్రావెన్షియల్ ఉద్యోగులు మండిపడుతున్నారు. తాము పరీక్ష ఎలా రాయాలని ప్రశ్నిస్తున్నారు.

హయ్యర్ గ్రేడ్ పరీక్ష ఉత్తీర్ణులైతేనే జేఏల పదోన్నతి

సబ్ ఇంజనీర్లు, ఏఈ, ఏఏఈలు అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్లుగా పదోన్నతి పొందడానికి, జూనియర్, సీనియర్ అసిస్టెంట్లు జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్(జేఏ)గా పదోన్నతి పొందడానికి అకౌంటెన్సీ హయ్యర్ గ్రేడ్ పరీక్ష ఉత్తీర్ణులైతేనే అర్హులవుతారు. ఈ పరీక్షను తెలంగాణ ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ (టీజీ ట్రాన్స్‌కో) ఏటా జూన్, డిసెంబర్ మాసంలో నిర్వహిస్తుంది. ఈ పరీక్ష ఈ నెల 8, 9 తేదీల్లో జరుగనుంది. టీజీ ఎన్పీడీసీఎల్‌కు చెందిన ఇంజనీర్లు, ఉద్యోగులు మొత్తం 119 మంది రాస్తున్నారు. ఇందులో 90 మంది సబ్ ఇంజనీర్లు, ఏఈ, ఏఏఈలుండగా మిగతా 29 మంది జూనియర్, సీనియర్ అసిస్టెంట్లున్నారు.

మార్కెట్‌లో లభ్యం కాని పుస్తకాలు..

జూనియర్, సీనియర్ అసిస్టెంట్ ఉద్యోగుల్లో బీకాం ఉత్తీర్ణులైన వారు ఈ డిపార్ట్‌మెంట్ టెస్టు రాయాల్సిన అవసరం లేదు. బీకాం అభ్యసించకుండా ఇతర డిగ్రీలు చదివిన వారు కచ్చితంగా ఈ పరీక్షలో ఉత్తీర్ణులైతేనే జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ పదోన్నతికి అర్హులవుతారు. ఈ పరీక్ష విధానం కఠినంగా ఉండడం, అకౌంటెన్సీకి సంబంధించిన పుస్తకాలు మార్కెట్‌లో లభ్యం కాకపోవడంతో పాటు, సంస్థ కూడా సమకూర్చకపోవడంతో ఎలా సన్నద్ధం కావాలో అర్థం కావడం లేదని పలువులు జూనియర్, సీనియర్ అసిస్టెంట్లు వాపోయారు. తమకు పరీక్షకు సంబంధించిన సబ్జెక్టు పుస్తకాలు అందిస్తే ప్రిపేరయ్యే అవకాశముంటుందన్నారు. సంబంధింత పుస్తకాలు అందించకుండా, ప్రిపేర్ కావడానికి సెలవులు ఇవ్వకుండా పరీక్ష రాయమంటే ఎలా ఉత్తీర్ణులవుతారని ప్రశ్నించారు. 2018 వరకు పరీక్ష విదానం,సిలబస్‌పై సంస్థ శిక్షణ ఇచ్చేదని, ఆ తర్వాత నుంచి శిక్షణ ఇవ్వడం లేదన్నారు. ఇలా అయితే తాము పరీక్ష రాసేదెట్లా అని మొత్తుకుంటున్నారు.

మూల్యాంకనం ఎవరు చేస్తారో తెలియని పరిస్థితి..

గతేడాది 30 మంది రాస్తే ఒక్కరు కూడా ఉత్తీర్ణత సాధించలేదని పలువురు ప్రావెన్షియల్ ఉద్యోగులు అన్నారు. ఒకరిద్దరు రెండు పేపర్లలో ఒకటి మాత్రమే ఉత్తీర్ణులయ్యారని, సబ్ ఇంజనీర్లు, ఏఈ, ఏఏఈలు మాత్రం వంద శాతం ఉత్తీర్ణులవుతున్నారన్నారు. కేవలం వారికి చూసి రాసే విధానాన్ని అవలంబిస్తున్నందునే వందశాతం ఫలితాలు సాధిస్తున్నారన్నారు. తమకు చూసి రాయడానికి, కనీసం చదువుకోవడానికి సంబంధించిన సిలబస్‌తో కూడిన పుస్తకాలు అందించకుండా పరీక్ష ఉత్తీర్ణత సాధించడం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. పరీక్ష రాసిన తర్వాత తాము ఎక్కడ పొరపాటు చేశామో తెలుసుకునేందుకు కూడా అవకాశం లేదని, ఈ పేపర్లు ఎవరు మూల్యాంకనం చేస్తారో..? ఎక్కడ చేస్తారో..? కూడా తెలియకుండగా చేస్తున్నారని, ఇక్కడే ఏదో మతలబు ఉందని అర్థమవుతోందని వారు పేర్కొంటున్నారు.

ప్రావెన్షియల్ ఉద్యోగులపై చిన్నచూపు..

ఇంజనీర్లు యాజమాన్యంగా ఉండడంతో తమ పట్ల చిన్నచూపు చూస్తున్నారని, వివక్ష ప్రదర్శిస్తున్నారని, ఇది వేధింపులకు గురిచేయడమేనని ప్రావెన్షియల్ ఉద్యోగులు మండిపడుతున్నారు. యూపీఎస్సీ నిర్వహించే సివిల్ సర్వీస్ పరీక్షలు కూడా ఇంత కఠినంగా ఉండవని ఆందోళన వ్యక్తం చేశారు. వాటికి సిలబస్ ఉండడంతో పాటు ప్రిపేర్ కావడానికి అవసరమైన పుస్తకాలు లభ్యమవుతాయన్నారు. కానీ విద్యుత్ ఉద్యోగులకు నిర్వహించే డిపార్ట్‌మెంట్ పరీక్షకు మాత్రం సిలబస్ లేదని, పుస్తకాలు లభ్యం కావన్నారు. విద్యుత్ సంస్థలకు చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్లుగా కొనసాగుతున్న ఐఏఎస్ అధికారులు ఈ పరీక్ష విధానాన్ని సమీక్షించాలని, పరీక్ష విధానంలో మార్పులు చేయాలని పలువురు ప్రావెన్షియల్ ఉద్యోగులు కోరుతున్నారు.

గ్రూప్-1 పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

- కలెక్టర్ సిక్తా పట్నాయక్


మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

హన్మకొండ అర్బన్: రేపు (ఆదివారం) జరుగనున్న గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. హనుమకొండ కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు విధిగా హాల్ టికెట్‌లో ఉన్న నియమ నిబంధనలను తప్పకుండా పాటించాలన్నారు. అభ్యర్థులు హాల్ టికెట్‌తో పాటు ఒక కలర్ ఫొటో, ఏదేని గుర్తింపు కార్డు (ఒరిజినల్))తెచ్చుకోవాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ రాధిక గుప్తా, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

144 సెక్షన్ అమలు..

వరంగల్ క్రైం: గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు పోలీస్‌శాఖ తరఫున అన్ని రకాల కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్‌కిశోర్‌ఝూ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రూప్-1 పరీక్షకు వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 76 సెంటర్లలో, 35 వేల మంది హాజరవుతున్నారని ఆయన తెలిపారు. పరీక్ష కేంద్రం వద్ద ఉదయం 6 గంటల నుంచి 144 సెక్షన్ అమలవుతుందని, అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని పేర్కొన్నారు.

మిషన్ భగీరథపై ఇంటింటి సర్వే

కాజీపేట: మిషన్ భగీరథ తాగునీరు ప్రజలకు అందుతున్న విధానాన్ని పరిశీలించేందుకు ప్రత్యేక సర్వే చేపట్టనున్నట్లు కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. కలెక్టరేట్‌లో శుక్రవారం రాత్రి నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని గ్రామాల్లో ఇంటింటి వెళ్లి నీరు సరఫరా అవుతున్న విషయంపై ప్రత్యేక సిబ్బంది సర్వే చేస్తారని తెలిపారు. సమావేశంలో డీఆర్డీఓ పీడీ నాగపద్మజ, జెడ్పీ సీఈఓ వేదవతి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులుపై ప్రజలను అప్రమత్తం చేయాలి


నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకుంటున్న మాధవ రెడ్డి

వరంగల్ అర్బన్: సీజనల్ వ్యాధులు ప్రజలకుండా ప్రజలను అప్రమతం చేస్తూ.. దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని బల్దియా బయాలజిస్ట్ మాధవరెడ్డి సూచించారు. శుక్రవారం నగరంలోని పలు డివిజన్లలో ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యల్లో భాగంగా 10 వారాలు దోమ లార్వాలు వృద్ధి చెందకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం వర్షకాలం నేపథ్యంలో రోగాలకు గురికాకుండా ముందస్తు ఆదేశాలు జారీ చేసిందన్నారు. మలేరియా ఫీల్డ్ వర్కర్లు క్షేత్రస్థాయిలో పర్యటించి దోమల నివారణ చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. కార్య్ర కమంలో హెల్త్ ఇన్‌స్పెక్టర్లు బలభద్ర రవి, మధుకర్, హెల్త్ అసిస్టెంట్లు రమేశ్, ప్రకాశ్, సంపత్, శ్యామ్, శివ కుమార్, శ్రవణ్ కుమార్, మల్లేశం, శ్రీనివాస్, అజీ, పాశం రవి, మహమూద్, తదితరులు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొన్న లారీ

- ఒకరి మృతి.. మరొకరి పరిస్థితి విషమం
- పెనుగొండ సమీపంలో ఘటన


గుంతలోకి దూసుకెళ్లిన లారీ

కేసముద్రం: ఎదురుగా వస్తున్న బైక్‌ను లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా మరొకరి పరిస్థితి విషమంగా మారింది. ఈ ఘటన శుక్రవారం మండలంలోని పెనుగొండ సమీపంలో చోటుచేసుకుంది. ఎస్సై వంశీధర్ కథనం ప్రకారం.. మండలంలోని సబ్‌స్టేషన్ తండాకు చెందిన మాజీ సర్పంచ్ గుగులోత్ వెంకన్న, గుగులోత్ వీరన్న(46) పని నిమిత్తం బైక్‌పై మానుకోటకు బయలుదేరారు. ఈ క్రమంలో పెనుగొండ క్రాస్ సమీపంలో ఎదురుగా వస్తున్న లారీ.. బైక్‌ను ఢీకొంది. దీంతో వీరన్న అక్కడికక్కడే మృతి చెందాడు. వెంకన్న తీవ్రంగా గాయపడడంతో మానుకోట జిల్లా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి వరంగల్ తరలించారు. కాగా, మానుకోట మాజీ ఎంపీ మాలోత్ కవిత జిల్లా ఆసుపత్రికి చేరుకుని బాధిత కుటుంబాలను పరామర్శించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వంశీధర్ తెలిపారు. కాగా, బైక్‌ను ఢీకొన్న అనంతరం లారీ రోడ్డు పక్కన ఉన్న చెట్టునూ ఢీకొని గుంతలోకి దూసుకెళ్లింది.

అనుమానాస్పద స్థితిలో నిట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ మృతి

కాజీపేట: కాజీపేట 61వ డివిజన్ ప్రశాంత్‌నగర్ కాలనీలో నివాసం ఉండే నిట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ రంగాచార్యులు (45) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. సిద్దిపేట జిల్లాకు చెందిన రంగాచార్యులు కొంత కాలంగా నిట్‌లో పని చేస్తున్నారు. మృతుడికి భార్య, కూతురు ఉన్నప్పటికీ కుటుంబ కలహాల నేపథ్యంలో దూరంగా ఉంటున్నాడు. ఈ క్రమంలో రంగాచార్యులు తోబుట్టువు శుక్రవారం ఉదయం ఫోన్ చేయగా లిఫ్ట్ చేయకపోవడంతో అనుమానం కలిగి పక్క వాళ్లకు చెప్పింది. దీంతో వారు తలుపులు పగులగొట్టి లోపలికి వెళ్లి చూడగా రంగాచార్యులు మంచంపై విగత జీవిగా పడి ఉన్నాడు. ఈ ఘటనపై మృతుడి సోదరి పోలీసులకు ఫిర్యాదు చేయగా అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతున్నారు

గుర్తుతెలియని వాహనం ఢీ.. యువకుడి దుర్మరణం


రాజ్‌కుమార్(ఫైల్)

కొత్తగూడ: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ యువకుడు దుర్మరణం చెందాడు. ఈ ఘటన శుక్రవారం కొత్తగూడలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. మండలకేంద్రానికి చెందిన బాల్య రాజ్‌కుమార్(25) సొంత పనుల నిమిత్తం గుంజేడు రోడ్డుకు వెళ్లాడు. ఈక్రమంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని వెళ్లింది. రోడ్డు పక్కన పడి ఉన్న రాజ్‌కుమార్‌ను స్థానికులు గమనించి నర్సంపేట ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఈవిషయంపై ఎస్సై దిలీప్‌ను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

ఇద్దరు యువతులను కలిపిన ఇన్‌స్టాగ్రాం

- పెళ్లి చేసుకుని కాపురం కూడా పెట్టారు..
- పెద్దలు వద్దన్నందుకు వారిలో ఒకరు బలవన్మరణం
- మహబూబాబాద్ జిల్లాలో ఘటన

కురవి: ఇద్దరు యువతులకు ఇన్‌స్టాగ్రాంలో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారి పెళ్లి కూడా చేసుకున్నారు. కొద్దిరోజులపాటు కాపురం చేశారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు పోలీసుల సమక్షంలో ఇద్దరికి కౌన్సెలింగ్ ఇప్పించారు.. దీంతో తమను దూరం చేశారని మనస్తాపానికి గురై ఓ యువతి ఎలుకల మందు తిని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా కురవి మండలంలో శుక్రవారం వెలుగులోకి వచ్చింది. కురవి మండలానికి చెందిన ఓ యువతి(22) బయ్యారం మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఓ యువతితో ఇన్‌స్టాగ్రాంలో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం కాస్త ప్రేమగా మారింది. దీంతో ఒకరినొకరు విడిచి ఉండలేని పరిస్థితికి వచ్చారు. పెళ్లి చేసుకున్నారు. ఇద్దరు యువతులు హైదరాబాద్‌కు వెళ్లి గదిని అద్దెకు తీసుకుని సహజీవనం సాగిస్తున్నారు. ఇరువురి తల్లిదండ్రులకు విషయం తెలిసి విస్తుపోయారు. అందులో ఓ యువతి తల్లిదండ్రులు కొన్ని రోజుల క్రితం తమ కుమార్తె ఇంటినుంచి వెళ్లి వేరే యువతిని పెళ్లి చేసుకున్నదని సీరోలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో సీరోలు ఎస్సై వారి ఆచూకీ తెలుసుకుని ఈ నెల 1వ తేదీన పోలీస్‌స్టేషన్‌కు ఇద్దరు యువతులు, వారి తల్లిదండ్రులను పిలిపించారు. సృష్టికి విరుద్ధంగా పెళ్లి చేసుకోవడం సరికాదని కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం ఇరువురు ఒప్పుకోవడంతో వారి తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ క్రమంలో ప్రేమికురాలు దూరమవుతుందనే మనస్తాపంతో కురవి మండలానికి చెందిన యువతి ఎలుకల మందు తాగింది. వెంటనే ఆమెను మహబూబాబాద్ జనరల్ ఆస్పత్రికి తరలించారు. చికిత్సపొందుతున్న ఆమె పరిస్థితి విషమించడంతో శుక్రవారం మృతి చెందింది. ప్రేమికురాలు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విషయం తెలుసుకున్న బయ్యారం మండలానికి చెందిన యువతి అదే రోజు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తెలిసింది. మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విజయ్‌రాంకుమార్ తెలిపారు. జరిగిన ఘటన జిల్లా వ్యాప్తంగా సంచలనం సృష్టించింది.

ఓవరాల్ చాంపియన్ భద్రాద్రి కొత్తగూడెం


ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్న భద్రాద్రి కొత్తగూడెం అథ్లెట్లు


అండర్-18 బాలుర విభాగంలో విజేతగా నిలిచిన హనుమకొండ అథ్లెట్లు

- అండర్-18 బాలుర విభాగంలో హనుమకొండ
- సీనియర్ మెన్ విభాగంలో కరీంనగర్..
- ముగిసిన అథ్లెటిక్స్ పోటీలు

వరంగల్ స్పోర్ట్స్: హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో రెండు రోజుల పాటు జరిగిన 10వ యూత్, సీనియర్ మెన్ అండ్ ఉమెన్ , సబ్ జూనియర్స్ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలు శుక్రవారం ముగిశాయి. 48 పాయింట్లతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అథ్లెట్లు ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నారు. అండర్-18 బాలుర విభాగంలో 30 పాయింట్లు సాధించి హనుమకొండ జిల్లా మొదటి స్థానంలో నిలిచింది. కాగా, అండర్-18 బాలికల విభాగంలో 15 పాయింట్లతో భద్రాద్రి కొత్తగూడెం విజేతగా నిలిచింది. సీనియర్ మెన్ కేటగిరీలో కరీంనగర్ జిల్లా అథ్లెట్లు 24 పాయింట్లతో, ఉమెన్ విభాగంలో ఖమ్మం జిల్లా 10 పాయింట్లతో మొదటి స్థానంలో నిలిచినట్లు నిర్వాహకులు తెలిపారు. కాగా, హనుమకొండ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల ముగింపు వేడుకలకు ద్రోణాచార్య అవార్డు గ్రహీత నాగపురి రమేశ్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు పతకాలు, సర్టిఫికెట్లు అందజేశారు. యువత క్రీడా మైదానాల్లో ఎక్కువ సమయం గడపాలని, శ్రమ, పట్టుదల, క్రమశిక్షణ అలవర్చుకుంటే లక్ష్యం సాధించొచ్చన్నారు. కార్యక్రమంలో డీవైఎస్ఓ అశోక్, అథ్లెటిక్స్ వరల్డ్ టెక్నికల్ కమిటీ డైరెక్టర్ స్టాన్ లీజోన్స్,అథ్లెటిక్స్ అసోసియేషన్ బాధ్యులు కే సారంగపాణి, నాగబాబు, వరద రాజేశ్వర్‌రావు, వెంకటేశ్వర్‌రెడ్డి, యుగంధర్‌రెడ్డి, టెక్నికల్ అఫీషియల్స్ మనోజ్, సాంబమూర్తి, రజనీకాంత్, సురేశ్, రాజు, గోపాల్, వాసు, అశ్విని పాల్గొన్నారు.

ఒంటరి మహిళా రోగులే లక్ష్యంగా..

- చోరీలకు పాల్పడుతున్న మహిళా దొంగ అరెస్ట్
- వివరాలు వెల్లడించిన ఏసీపీ నందిరాంనాయక్


నిందితురాలి అరెస్టు చూపుతున్న ఏసీపీ నందిరాంనాయక్

రామన్నపేట : ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ఒంటరి మహిళా రోగులను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్న మహిళా దొంగను మట్టెవాడ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేసినట్లు వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్ తెలిపారు. నిందితురాలు నుంచి రూ.2.50 లక్షల విలువైన 35 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఏసీపీ నందిరాం నాయక్ కథనం ప్రకారం.. కరీంనగర్ జిల్లా ముల్కనూరుకు చెందిన తురసటి శారద సులభంగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో చికిత్స కోసం ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ఒంటరి రోగులతో పరిచయం పెంచుకుంటుంది. వారితో చనువుగా ఉంటూ నిర్మానుష్య ప్రదేశాలకు తీసుకెళ్లి అక్కడ బెదిరింపులు పాల్పడి వారి శరీరంపై ఉన్న బంగారం అపహరిస్తోంది. ఇదే తరహాలో నిందితురాలు గత నెల 28వ తేదీన చికిత్స కోసం ఎంజీఎం వచ్చిన ఓ మహిళా రోగి వద్ద బంగారు గొలుసు చోరీ చేసింది. ఈ ఘటనపై బాధిత మహిళ ఫిర్యాదు మేరకు మట్టెవాడ పోలీసులు కేసు నమోదు చేసుకుని సీఐ గోపి ఆధ్వర్యంలో ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు చేశారు. టెక్నాలజీ సాయంతో నిందితురాలు మట్టెవాడలో ఉన్నట్లు గుర్తించారు. మరోమారు చోరీ చేసేందుకు ఎంజీఎం వచ్చినట్లు పోలీసులకు సమాచారం రావడంతో ఎస్సై విఠల్ సిబ్బందితో వెళ్లి నిందితురాలిని అదుపులోకి విచారించగా నేరం అంగీకరించింది. అలాగే, గతంలో ఎల్కతుర్తి, హుజూరాబాద్ పీఎస్‌ల పరిధిలో చోరీలకు పాల్పడినట్లు అంగీకరించడంతో పాటు ఆమె సమాచారంతో చోరీ సొత్తును స్వాధీనం చేసుకొని అరెస్ట్ చేసినట్లు ఏసీపీ తెలిపారు.

బీఆర్‌ఎస్ సపోర్ట్‌తోనే బీజేపీ గెలిచింది


మాట్లాడుతున్న మంత్రి సురేఖ, చిత్రంలో ఎమ్మెల్యేలు, రేవూరి, కడియం, నాగరాజు, ఎంపీ కావ్య

- అధికార చిహ్నం పై చర్చలు జరుగుతున్నాయి
- రాష్ట్ర మంత్రి కొండా సురేఖ

హన్మకొండ చౌరస్తా: ఎంపీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ డబ్బులు పంచి బీజేపీకి ఓట్లు వేయించిందని, అందుకే తెలంగాణలో ఆ పార్టీ 8 సీట్లను గెలుచుకోగలిగిందని రాష్ట్ర మంత్రి కొండా సురేఖ అన్నారు. హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో, వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కడియం శ్రీహరి, కేఆర్ నాగరాజుతో కలిసి శుక్రవారం మంత్రి విలేకరులతో మాట్లాడారు. ఎన్నికలను తామంతా రెఫరెండంగా తీసుకుని కలిసికట్టుగా పనిచేశామన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలలో ఎన్నికల ముందే ఐదింటిని అమలు చేసిన తీరును ప్రజలు గుర్తించారన్నారు. మచ్చలేని వ్యక్తి కడియం శ్రీహరి ప్రభావం కూతురు కావ్యపై పడిందని, అందుకే ప్రజలు గెలిపించారన్నారు. రాష్ట్ర అధికారిక చిహ్నంలో కాకతీయ తోరణం తొలగిస్తారన్నది ఊహాగానాలే అని అన్నారు. అసెంబ్లీలో చర్చించి, అందరి అభీష్టం మేరకే నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ముందు కడియం కుటుంబంపై సభ్యత, సంస్కారం మరిచి నీచస్థాయిలో విమర్శలు చేశారన్నారు. వాటన్నింటినీ ప్రజలు నమ్మకుండా తమకు పట్టం కట్టారని అన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ భవిష్యత్‌లో మైనారిటీలు, పేదలు, రాజ్యాంగం జోలికి వస్తే కాంగ్రెస్ పార్టీ ఊరుకోదన్నారు. డాక్టర్ కావ్యపై దుర్మార్గంగా, నీచంగా మాట్లాడారని, ప్రజలు వివేకంతో మసులుకుని కావ్యను గెలిపించారన్నారు. సమావేశంలో నగర మేయర్ గుండు సుధారాణి, వరంగల్ డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, పీసీసీ సభ్యులు ఈవీ శ్రీనివాసరావు, నమిండ్ల శ్రీనివాస్, బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నాయిని లక్ష్మారెడ్డి, వీసం సురేందర్‌రెడ్డి, నిమ్మని శేఖర్‌రావు, బంక సరళ, కూచన రవళి తదితరులు పాల్గొన్నారు.

దుష్ప్రచారం చేసి గెలిచిన కాంగ్రెస్


మాట్లాడుతున్న బీజేపీ అభ్యర్థి అరూరి రమేశ్

- పరోక్షంగా మాదే విజయం
- బీజేపీ వరంగల్ ఎంపీ అభ్యర్థి అరూరి రమేశ్

హన్మకొండ: అసత్య ఆరోపణలు, దుష్ప్రచారం చేసి లోక్‌సభ ఎన్నికల్లో వరంగల్ స్థానంలో కాంగ్రెస్ పార్టీ గెలిచిందని బీజేపీ సీనియర్ నాయకుడు, ఆ పార్టీ అభ్యర్థి అరూరి రమేశ్ అన్నారు. శుక్రవారం హనుమకొండ హంటర్ రోడ్డులోని వేద బాంక్వెట్ హాల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగం మారుస్తారని, రిజర్వేషన్లు రద్దు చేస్తారని కాంగ్రెస్ దుష్ప్రచారం చేసి ఎన్నికల్లో లబ్ధి పొందిందన్నారు. అయినా కేంద్రంలో అధికారంలోకి రాలేకపోయిందని విమర్శించారు. దేశ ప్రజలు మరోసారి నరేంద్ర మోదీ ప్రధాని కావాలని ఆశించారని, అదే జరిగిందన్నారు. మండుటెండల్లో తన గెలుపునకు శ్రమించిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఓటు వేసిన ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రానికి చెందిన 8 మంది బీజేపీ ఎంపీల సాయంతో ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ మాట్లాడుతూ కూటమి కట్టిన కాంగ్రెస్ పెద్దగా సాధించిందేమీ లేదని, బొక్కాబోర్లా పడ్డదని విమర్శించారు. బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మార్తినేని ధర్మారావు మాట్లాడుతూ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు ఎప్పుడైనా రావొచ్చన్నారు. తాము కావాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొట్టమని, దానంతటదే అదే కూలిపోతేదే తామేమీ చేయలేమన్నారు. సమావేశంలో మాజీ మేయర్ డాక్టర్ టీ రాజేశ్వర్ రావు, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవి కుమార్, పార్లమెంట్ కన్వీనర్ తాళ్లపల్లి కుమారస్వామి, నాయకులు డాక్టర్ పెసరు విజయ్ చందర్‌రెడ్డి, కొలను సంతోశ్‌రెడ్డి, గాడిపల్లి రాజేశ్వర్ రావు, గాదె రాంబాబు, కందగట్ల సత్యనారాయణ, ముత్తిరెడ్డి కేశవరెడ్డి, కడవేరు శ్రీనివాస్, జైపాల్, రమేశ్ యాదవ్ పాల్గొన్నారు.